క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్కలు నాటుతున్న స్కౌట్స్ అండ్ గైడ్స్

రాజమహేంద్రవరం సిటీ: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ బి.సైదయ్య పేర్కొన్నారు. సౌత్ సెంట్రల్ రైల్వే భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ రాజమహేంద్రవరం విభాగం 75వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం రైల్వే స్కౌట్ డెన్ ఆవరణ లోకబ్స్, బుల్బుల్స్, స్కౌట్స్, గైడ్స్, రోవర్స్, రేంజర్స్ మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సైదయ్య మాట్లాడుతూ భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ దేశమంతటా స్కౌట్ గైడ్ వీక్‌ను జరుపుకుంటుందన్నారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ సమాజ సేవా కార్యక్రమాల్లో ముందంజలో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్పీఎఫ్ సబ్ ఇన్ స్పెక్టర్ వరలక్ష్మి, ఆర్పీఎఫ్ సిబ్బంది, రేంజర్ ఎస్.ఐంద్రి, రోవర్ బి.నూకరాజు, రోవర్ పి.శ్యామ్, స్కౌట్ కె.కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన వన భోజనాల సందడి



కార్తీక వన సమారాధనలో ప్రసంగిస్తున్న మంత్రి కందుల దుర్గేష్

ధవళేశ్వరం: కార్తిక మాసం సందర్భంగా వన భోజనాల సందడి ప్రారంభమైంది. ధవళేశ్వరం కాటన్ మ్యూజియంలో ఆదివారం శెట్టి బలిజ సంక్షేమ సంఘం కార్తీక వన సమారాధన జరిగింది. కార్యక్రమానికి రాష్ట్ర పర్యాటక ,సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ , రాజమహేంద్రవరం నగర ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో శెట్టిబలిజ సంఘ నాయకులు పాల్గొన్నారు.

అకాల వర్షంతో తడిసిన ధాన్యం

రాజమహేంద్రవరం రూరల్: రూరల్ మండలంలో శనివారం అర్ధరాత్రి కురిసిన వర్షానికి వరి కోతలు కోసి కుప్పలుగా పోసిన ధాన్యం తడిసి ముద్దయింది. కాతేరు తదితర ప్రాంతాల్లో తడిచిన ధాన్యాన్ని రోడ్డుపై ఆరబోసి రైతులు ఎండబెడుతున్నారు. కోతకు వచ్చిన పంట చేలల్లో వర్షం రాకతో నీళ్లు చేరడంతో కోతలను నిలుపుదల చేశారు.

అలరించిన శాస్త్రీయ సంగీతం



శాస్త్రీయ సంగీత, నృత్య కార్యక్రమం

రాజమహేంద్రవరం సిటీ: సద్గురు సన్నిధి ఆధ్వర్యంలో శ్రీ త్యాగరాజ నారాయణ దాస సేవా సమితి నిర్వహించిన శాస్త్రీయ సంగీత, నృత్య కార్యక్రమం ఆహూతులను అలరించిందని నిర్వాహకులు శిష్ట్ల మధుసూదనరావు తెలిపారు. ఆదివారం నిర్వహించిన వాద్య సంగీత సభ, గాత్ర సంగీత సభ ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయని చెప్పారు.

యువకుడి ఆత్మహత్య

రంగంపేట: మనస్తాపంతో యువకుడు ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందినట్టు ఎస్ఐ తోట కృష్ణసాయి తెలిపారు. ఆదివారం ఆయన తెలిపిన వివరాల మేరకు.. గండేపల్లి మండలం పాత నాయకంపల్లి గ్రామానికి చెందిన నిమ్మలపూడి సత్యసాయి (22) ఇంటర్ వరకు చదివి తన అన్నయ్య సాయికృష్ణతో కలిసి రంగంపేట మండలం కోటపాడు గ్రామంలో కోళ్లఫారం నిర్వహిస్తున్నాడు. అక్టోబరు 12న తన స్నేహితులతో కలిసి అయ్యప్ప మాల ధరించి పూజా కార్యక్రమాల్లో పాల్గొంటున్నాడు. గత నెల 30న స్నేహితుడైన రాజేష్ క్రెడిట్ కార్డు అతనికి తెలియకుండా తీసి దాని ద్వారా సత్యసాయి పెట్రోల్ కొనుగోలు చేశాడు. అయితే క్రెడిట్ కార్డు తీసిన సంగతి రాజేష్‌కు తెలియడంతో రాజేష్ ఎక్కడ నిలదీస్తాడోనని భయపడి మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో 31న ఉదయం నాలుగు గంటలకు పూజ ఉందని ఇంట్లో వాళ్లకు చెప్పి బయటకు వెళ్లి కోటపాడు గ్రామ శివారు సుకృతి లే అవుట్‌లో ఒంటికి నిప్పు అంటించుకొని మృతి చెందాడు.

నగర కాంగ్రెస్ అధ్యక్ష పదవికి బాలేపల్లి రాజీనామా

రాజమహేంద్రవరం సిటీ: వ్యక్తిగత కారణాలతో కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్ష పదవితో పాటు రూరల్ ఇన్‌ఛార్జ్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు నగర అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్ ప్రకటించారు. ఆదివారం నగరంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. పార్టీలో సాధారణ కార్యకర్తగా కొనసాగుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ప్రకటించారు. పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిళ పంపిన లేఖను విడుదల చేశారు. పార్టీలో సామాన్య కార్యకర్తగా కొనసాగాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. తాను వ్యక్తిగత కారణాలతోనే కాంగ్రెస్ పార్టీలో పదవులకు రాజీనామా చేశానన్నారు.

కమిషనర్ సారూ.. ఇదేనా వసతుల తీరు?

కార్తిక మాసంలో పుష్కర ఘాట్ వద్ద పుణ్య స్నానాలు ఆచరించే భక్తులకు సకల సౌకర్యాలు కల్పిస్తామని శనివారం కమిషనర్ ప్రకటన చేశారు. దీంతో నగర వాసులతో పాటు సమీప ప్రాంతాల వారు హర్షం వ్యక్తం చేశారు. తీరా స్నానానికి వెళ్ల చూసేసరికి గోదావరి పుష్కర ఘాట్ వద్ద ప్లాస్టిక్ వ్యర్థాలు భారీ ఎత్తున పేరుకుపోయి ఉండటంతో వచ్చిన వారంతా అవాక్కయ్యారు. కమిషనర్ ఇచ్చిన మాటను నిలబెట్టుకోకపోవడంతో అసహనానికి గురయ్యారు. మహిళలు, అయ్యప్ప స్వామి, శివమాల ధారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

- పుష్కర ఘాట్ వద్ద గోదావరిలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు
- స్నానాలు చేయలేక వెనుదిరిగిన భక్తులు
- భరించలేని దుర్గంధంతో అవస్థలు
- నగరపాలక సంస్థ అధికారులపై మండిపాటు



పుష్కర ఘాట్ వద్ద గోదావరిలో పేరుకుపోయిన వ్యర్థాలు

రాజమహేంద్రవరం సిటీ: కార్తిక మాసం ప్రారంభం కావడంతో రాజమహేంద్రవరం నగరంతో పాటు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన భక్తులు వేలాదిగా పుణ్య స్నానాలు ఆచరించేందుకు తరలి వస్తారని వారి కోసం చర్యలు చేపట్టామంటూ కమిషనర్ కేతన్ గార్గ్ ప్రకటించి 12 గంటలు గడవక ముందే ఘాట్‌లో ఈ విధమైన దుస్థితి నెలకొనడంపై భక్తులు విస్మయం చెందారు. నగర పాలక సంస్థ ఇంజినీరింగ్, హెల్త్, శానిటరీ అధికారులతో శనివారం నగరంలో పలు ఘాట్‌లను పరిశీలించి చర్యలు చేపడుతున్నట్లు కమిషనర్ ప్రకటించారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో కార్తిక మాస పుణ్య స్నానాలు ఆచరించే భక్తులకు 11 గోదావరి ఘాట్లలో ఏ విధమైన అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశామని ప్రకటించారు. అయితే నగరంలో ప్రసిద్ధి చెందిన పుష్కర ఘాట్‌లో ఆదివారం కార్తికమాసం పుణ్య స్నానాలు ఆచరించేందుకు వెళ్లిన భక్తులకు దారుణమైన పరిస్థితి దాపురించింది. గోదావరి నదిలో దిగి స్నానం ఆచరించేందుకు ఏమాత్రం అవకాశం లేకుండా పుష్కర ఘాట్, న్యూ పుష్కర ఘాట్‌లలో గోదావరిలో భారీ ఎత్తున వ్యర్థాలు వచ్చి పేరుకు పోయాయి. కనీసం నదిలో కాళ్లు పెట్టడానికి వీలు లేనంత విధంగా వ్యర్థాలు చేరుకోవడంతో కార్తిక మాస పుణ్య స్నానాలు ఆచరించేందుకు తరలి వచ్చిన భక్తజనం ఖంగు తిన్నారు . దశాబ్దాల కాలంగా ఇటువంటి పరిస్థితి ఎన్నడూ చూడలేదంటూ మహిళా భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నదిలో ఇంత పెద్ద ఎత్తున వ్యర్థాలు చేరుకోవడంతో పాటు తీవ్ర దుర్గంధం అలముకోవడంతో పుణ్య స్నానాలు చేయకుండానే 50 శాతం పైగా భక్తులు వెనుదిరగాల్సిన దౌర్భాగ్య స్థితి నెలకొంది. కార్తిక మాసం రెండవ రోజునే ఈ విధమైన పరిస్థితి నెలకొంటే కార్తిక సోమవారం రోజున ఇంకెలా ఉంటుందోనని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెల రోజుల పాటు పుణ్య స్నానాలు ఆచరించే భక్తులకు సౌకర్యాల కల్పనలో విఫలమైన నగరపాల సంస్థ అధికారులపై మహిళలు మండిపడ్డారు.

కోటి లింగాల ఘాట్‌తో పాటు కనకదుర్గ, చింతాలమ్మ ఘాట్‌లలో సైతం స్నానం ఆచరించేందుకు అంతగా సౌఖర్యాలు లేవని భక్తులు వాపోతున్నారు. కార్తికమాసంలో పుణ్యస్నానాలు ఆచరించే భక్తులకు అన్ని ఘాట్‌లలో షవర్ బాత్‌లు ఏర్పాటు చేసినట్లయితే ఇబ్బందులు ఉండవని మహిళలు అభిప్రాయ పడుతున్నారు.

ఇటువంటి పరిస్థితి ఎన్నడూ లేదు..



పుష్కర ఘాట్ భారీ ఎత్తున ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోవడంతో పాటు దుర్గంధం వెదజల్లడం గతంలో ఎప్పుడూ చూడలేదు. స్నానం చేసేందుకు ఏమాత్రం అవకాశం లేకుండా వ్యర్థాలతో గోదావరి ఘాట్ నిండిపోయింది. చాలా మంది మహిళలు స్నానాలు చేయకుండానే వెనుదిరిగి వెళ్లిపోయారు. ఈ విధమైన పరిస్థితి ఉంటుందని ఊహించలేదు. అయ్యప్ప స్వామి మాలదారులు, శివమాల ధారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఘాట్‌లలో పుణ్యస్నానాలు చేసే రోజుల్లో అధికారులు ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణం.

– మంగరాజు, శివ మాలధారుడు, రాజమహేంద్రవరం.

అధికారుల తీరు దారుణం..



పుణ్య స్నానాలు ఆచరించేందుకు వచ్చిన మహిళలకు తీవ్ర ఇబ్బంది, నిరాశ కలిగింది. నగరంలో ప్రసిద్ధి చెందిన పుష్కర ఘాట్‌లో ఈ విధమైన పరిస్థితి ఏర్పడటం దారుణం. మహిళలు భక్తి ప్రపత్తులతో దూర ప్రాంతాల నుంచి పుణ్య స్నానాలకు తరలివస్తే ఇలాంటి పరిస్థితి ఏర్పడుతుందని కలలో కూడా ఊహించి ఉండరు. చాలా మంది అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసి ఇంటికి తిరిగి వెళ్లిపోయారు. కార్తిక మాసం ప్రారంభమైన రెండవ రోజునే ఇలాంటి పరిస్థితి ఏర్పడటం నగర పాలక సంస్థ సిబ్బంది, అధికారుల నిర్లక్ష్యానికి తార్కాణంగా నిలుస్తోంది.

– శ్యామల, భక్తురాలు, రాజమహేంద్రవరం

రెడ్డి సంఘీయుల సంక్షేమానికి కృషి చేస్తా



బొమ్మూరు రెడ్డి సంక్షేమ సంఘం కార్తిక వన సమారాధనలో మాట్లాడుతున్న మేడపాటి షర్మిలారెడ్డి

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు గ్రామంలోని రెడ్డి సంఘీయుల సంక్షేమానికి కృషి చేస్తానని ప్రముఖ న్యాయవాది, గొందేశి పూర్ణచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు గొందేశి శ్రీనివాసులరెడ్డి అన్నారు. ఆదివారం బొమ్మూరు గ్రామంలో జీపీఆర్ తోటలో బొమ్మూరు రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆయన నేతృత్వంలో కార్తిక వన సమారాధన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మేడపాటి షర్మిలారెడ్డి మాట్లాడుతూ రెడ్డి సంఘీయుల మహిళలు అన్ని రంగాలలో రాణించాలని పిలుపునిచ్చారు. కోస్తాంధ్ర రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు కర్రి త్రినాథ రెడ్డి మాట్లాడుతూ ఈనెల 10న అనపర్తి మండలం దుప్పలపూడిలో జరిగే కోస్తాంధ్ర రెడ్డి సంక్షేమ సంఘం కార్తిక వన సమారాధనకు ప్రతి ఒక్కరు హాజరు కావాలని ఆహ్వానించారు. కార్యక్రమంలో బొమ్మూరు రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షులు నారాయణరెడ్డి, ఉపాధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, వ్యవస్థాపక అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, గౌరవ అధ్యక్షులు సద్గుణ రామారెడ్డి, సంఘీయులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న అరుణ్ తదితరులు

కడియం: మండలంలోని బుర్రిలంక గ్రామానికి చెందిన రౌతు కస్తూరిని అత్యాచారం, హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించి ఆమె కుటుంబాన్ని ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలని సీపీయం జిల్లా కార్యదర్శి టీ.అరుణ్ డిమాండ్ చేశారు. ఆదివారం ప్రజా సంఘాల నాయకులతో కలిసి ఆయన బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.25 లక్షల నష్ట పరిహారంతో పాటు ఇల్లు నిర్మించి ఇవ్వాలన్నారు. బాధిత కుటుంబీకులను ఆదుకోవాలన్నారు. అత్యాచారం, హత్య గావించబడిన మహిళ పనిచేసే నర్సరీ యాజమాన్యం, నర్సరీ అసోసియేషన్ ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. గంజాయి, మద్యాన్ని ఏరులై పారించడం వల్లే యువత ఇటువంటి దురాగతాలకు పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. తక్షణం నిందితులను కఠినంగా శిక్షించే విధంగా చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ప్రజా సంఘాలు, ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి పి.తులసి, జిల్లా ఉపాధ్యక్షురాలు స్రవంతి, యుటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ అరుణ కుమారి, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి వై.బేబీరాణి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్ఎస్ మూర్తి, సీపీఎం నాయకులు పి.మురళి, యుటీఎఫ్ నాయకులు చిలుకూరి శ్రీనివాస్, గ్రామిక మహిళా నేతలు పాల్గొన్నారు.

కడియం: నర్సరీ కూలీ రౌతు కస్తూరిది గంజాయి మాఫియా హత్య అని ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు రొంగల గోపీ శ్రీనివాస్ అన్నారు. బుర్రిలంకలో అత్యాచారానికి గురైన కస్తూరి కుటుంబాన్ని బీజేపీ నాయకులు ఆదివారం పరామర్శించారు. వారు మాట్లాడుతూ కస్తూరి మరణంతో కుటుంబం వీధిన పడిందన్నారు. సంఘటన జరిగిన పది రోజులకు గాని నేరస్తులను గుర్తించలేని బలహీనమైన స్థితిలో పోలీసు వ్యవస్థ ఉందన్నారు. కస్తూరి హత్యతో గంజాయి వ్యాపారస్తుల పట్ల పోలీస్, ఎక్సైజ్ శాఖ అధికారుల ఉదాసీన వైఖరి బయట పడిందన్నారు. గంజాయికి బానిసలైన యువకులపై నిఘా పెంచి కౌన్సిలింగ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ ఆకుల శ్రీధర్, కో కన్వీనర్ యానాపు ఏసు, మండల అధ్యక్షులు నాగులపల్లి వీరబాబు, జిల్లా ఉపాధ్యక్షులు కరుటూరి శ్రీనివాస్, కొటికలపూడి వెంకటేశ్వరావు, బొరుసు సుబ్రహ్మణ్యం, పాతంశెట్టి రాజేష్, మరకాని సతీష్ ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

శెట్టిబలిజ సంఘీయుల సంక్షేమానికి కృషి

ఎమ్మెల్సీ కుడిపూడి సూర్యనారాయణ



వన భోజన మహోత్సవానికి హాజరైన శెట్టిబలిజ సంఘీయులు

రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్రంలో శెట్టి బలిజ సంఘీయుల సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్సీ, ఉభయ తెలుగు రాష్ట్రాల శెట్టి బలిజ మహానాడు కన్వీనర్ కుడిపూడి సూర్యనారాయణ అన్నారు. ఆదివారం స్థానిక చెరుకూరి గార్డెన్స్‌లో రాష్ట్ర శెట్టి బలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర సంఘ నాయకుడు సానబోయిన రామారావు అధ్యక్షతన నిర్వహించిన వనభోజన మహోత్సవం ఉత్సాహంగా జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న సూర్యనారాయణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ పిల్లలను ఉన్నత విద్యా వంతులుగా తీర్చదిద్దడం ద్వారా సంఘీయులంతా ఉన్నత స్థాయికి ఎదిగి ఆర్థికంగా అభివృద్ధి చెందుతారన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా వైద్య విభాగ అధ్యక్షురాలు డా.అనసూరి పద్మలత, మాజీ కార్పొరేటర్లు పిల్లి నిర్మల, పితాని లక్ష్మి, సింహ నాగమణి, జెడ్పీటీసీ సభ్యులు కుడిపూడి శ్రీనివాస్, వాసంశెట్టి పెద్ద వెంకన్నలను ఘనంగా సత్కరించారు.

వివాహ పరిచయ వేదికకు స్పందన

వనభోజన మహోత్సవంలో నిర్వహించిన శెట్టి బలిజ వధూవరుల ఉచిత వివాహ పరిచయ వేదికకు స్పందన లభించింది. వధూవరుల తల్లిదండ్రులు తమ పిల్లల ఫోటోలతో బయోడేటాలు అందించారు. వన భోజన మహోత్సవం, ఉచిత వివాహ పరిచయ వేదిక విజయవంతం అయ్యేందుకు కృషి చేసిన నిర్వహణ కమిటీ సభ్యులు మట్టపర్తి సత్యనారాయణ, బత్తిన ఏడుకొండలు, ఆనెం చిన్న, యర్రా మల్లేశ్వరరావు, బొక్క సత్య వెంకట ప్రతాప్‌లను సన్మానించారు. తూర్పు, పశ్చిమ గోదావరి, నరసాపురం, కోనసీమ, విశాఖ జిల్లాల శెట్టి బలిజ సంక్షేమ సంఘాల అధ్యక్షులు హాజరయ్యారు. వనభోజన మహోత్సవంలో మహిళలు, చిన్నారులకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

అభికి ప్రతిష్టాత్మక నాట్య మనోహరి పురస్కారం



నాట్య మనోహరి అవార్డుకు ఎంపికైన అభి

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం నగరానికి చెందిన శివసాయి కూచిపూడి నృత్య కళాక్షేత్రం విద్యార్థిని సీహెచ్ అభి నాట్య మనోహరి పురస్కారానికి ఎంపిక కావటం అభినందనీయమని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మేడా శ్రీనివాస్ కొనియాడారు. భవిష్యత్‌లో చిన్నారి అభి మరెన్నో పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షించారు. సాంస్కృతిక రాజధానిగా పేరుగాంచిన రాజమహేంద్రవరం నగరానికి అభి వంటి చిన్నారుల అవసరం ఉందన్నారు. ప్రభుత్వం శివసాయి కూచిపూడి నృత్య కళాక్షేత్రాన్ని గుర్తించి ప్రోత్సహించాలన్నారు. ఈ నెల 14న హైదరాబాద్‌లోని ఫిల్మ్ నగర్‌లోని రామానాయుడు కల్యాణ మండపంలో ప్రముఖుల చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నట్లు చెప్పారు. విశ్రాంత న్యాయమూర్తి వీఆర్ పాటేల్, ఆంధ్ర లాయర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎమ్‌వి రాజారామ్, ప్రముఖ తెలుగు సినీ హీరో శ్రీ రామ్, జై ఆంధ్ర డెమోక్రటిక్ ఫోరం కార్యదర్శి అవధానుల హరి, ఏపీ కాంగ్రెస్ డాక్టర్స్ సెల్ చైర్మన్ డాక్టర్ జాన్ బాబు, డాక్టర్ కే.వర ప్రసాద్, పెళ్లకూరు సురేంద్ర రెడ్డి, తెలుగు సినిమా డైరెక్టర్ చంద్ర మహేష్ తదితర ప్రముఖులు చిన్నారి అభి నృత్య సేవలను కొనియాడారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

రాజానగరం: దివాన్ చెరువులోని పీజీఎం పాఠశాలలో 2011–14 మధ్య కాలంలో పదో తరగతి చదువుకున్న మూడు బ్యాచ్‌లకు చెందిన పూర్వ విద్యార్థులు లాలాచెరువులోని గోదావరి మహా పుష్కర వనంలో ఆదివారం ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. గడచిన పదేళ్లలో వచ్చిన మార్పులు, సాధించిన ప్రగతిని ఒకరి కొకరు చెప్పుకొంటూ కుశల ప్రశ్నలతో సరదాగా గడిపారు. సహపంక్తి భోజనాలు చేశారు. తిరిగి స్వస్థలాలకు పయనమయ్యారు.

మెడికల్ ప్రొవైడర్ల సేవలు అభినందనీయం



ఉసిరి చెట్టు వద్ద పూజలు నిర్వహిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

రాజమహేంద్రవరం రూరల్: పేద, మధ్య తరగతి ప్రజలకు బేసిక్ మెడికల్ ప్రొవైడర్లు నిత్యం అందుబాటులో ఉండి అందిస్తున్న వైద్య సేవలు అభినందనీయమని టీఎస్‌కే హాస్పిటల్స్ అధినేతలు డా.తోట స్వరూప్, డా.తోట సౌమ్యలు అన్నారు. బేసిక్ మెడికల్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సంఘం ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం నుంచి నామవరం వెళ్లే మార్గంలో కార్తిక వన సమారాధన మహోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు వి.వి.కృష్ణారావు, ఉపాధ్యక్షుడు యస్.రామ లక్ష్మణరావు, ప్రధాన కార్యదర్శి సిరికి శ్రీనివాస్, కోశాధికారి ఏవీఎస్ శ్రీనివాస్ దంపతులు ఉసిరి చెట్టు కింద విష్ణుమూర్తికి నమస్కరించి పూజలు నిర్వహించారు.

పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ జాయింట్ సెక్రటరీ వైఎస్ సత్యనారాయణ మూర్తి, జిల్లా అధ్యక్షుడు యస్.మురళీధర్, ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్, కోశాధికారి హెచ్.హరిబాబు, ఆర్.శ్యామ్ కుమార్, బర్రే నరసింహమూర్తి, షేక్ ఆషిక్, సునీల్‌లతో పాటు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా అయ్యప్ప పడిపూజ



రాజానగరంలో పడిపూజ నిర్వహిస్తున్న అయ్యప్ప మాలధారులు



రంగంపేటలో అయ్యప్ప పడిపూజ

రాజానగరం: స్థానిక గాంధీ బొమ్మ సెంటరులోని వినాయకుడి ఆలయం వద్ద ఆదివారం రాత్రి అయ్యప్ప దీక్షా ధారులతో అయ్యప్ప సేవా సమాజం ఆధ్వర్యంలో అయ్యప్ప పడి పూజను వైభవంగా నిర్వహించారు. ఉదయం లక్ష్మీ గణపతి హోమం నిర్వహించి, మధ్యాహ్నం గ్రామంలో ఊరేగుతూ పేటతుళ్ల నిర్వహించారు. రాత్రి పడిపూజ జరిగింది. కార్యక్రమానికి రాజానగరం, నరేంద్రపురం, వెలుగుబంద, చక్రద్వార బంధం, దివాన్‌చెరువు, నందరాడ, సీతారామపురం, కలవచర్ల, వెంకన్నపేట, రామస్వామిపేట, ఎస్టీరాజపురం, ఫరిజల్లిపేట, కానవరం, తోకాడ, మల్లంపూడి, ముక్కినాడ తదితర గ్రామాల నుంచి అయ్యప్ప స్వాములు భారీగా తరలివచ్చారు. మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

రంగంపేట: కార్తిక మాసంలో శారీరక, మానసిక ఆరోగ్యంతో జీవించడానికి అయ్యప్ప దీక్షలు దోహదం చేస్తాయని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మండల కేంద్రమైన రంగంపేట గ్రామంలో మణికంఠ క్షేత్రం వద్ద గురుస్వామి చొల్లంగి అర్జునరావు ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామికి నిర్వహించిన లక్ష బిల్వార్చన, పడిపూజ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలిచిన గురుస్వామి అర్జునరావును ఎమ్మెల్యే సత్కరించారు. అనంతరం మండల వ్యాప్తంగా తరలివచ్చిన అయ్యప్ప మాల ధారులతో పడిపూజ ఘనంగా నిర్వహించారు. శరణుఘోషతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. కార్యక్రమంలో పల్నాడు జిల్లా నరసరావుపేటకు చెందిన డప్పు శ్రీను కళా బృందం ఆలపించిన అయ్యప్ప నామ సంకీర్తన ఆద్యంతం అలరించింది. మంటపంలో స్వామి వారిని వేలాది మంది దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అంతకుముందు కాగడాల హారతులతో అయ్యప్ప మాల ధారులు గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు.

సినిమాలు



శ్యామల	: బఘీర
సూర్యమినీ	: జనక అయితే గనక
సూర్యప్యాలెస్	: లక్కీ భాస్కర్
శివజ్యోతి	: క
అనుశ్రీ	: క
స్వామి	: అమరన్
అశోక	: లక్కీ భాస్కర్
రాజా	: అమరన్
రంభ	: భూల్‌భులాయియా–3
ఊర్వశి	: అమరన్
మేనక	: విశ్వం
కుమారి	: దేవర
అప్సర నామవరం	: లక్కీ భాస్కర్
వీఎస్.మహల్ ధవళేశ్వరం	: లక్కీ భాస్కర్, క
మురళీకృష్ణ కడియం	: లక్కీ భాస్కర్
వెంకటసూర్య	: లక్కీ భాస్కర్